# ఎన్నిక

ఆదూరి వెంకట సీతారామమూర్తి

పెళ్ళి చూపులనాడు గోపాలం రాధను చూసి, "ఫర్వాలేదు. బాగానే వుంది" అనుకున్నాడు- ఆ మాటే వాళ్ళ అమ్మా నాన్నలతో చెప్పేడు- 'ఐతే సంబంధం ఖాయం చెయ్యమంటావా' అనడిగేరు వాళ్ళు.



"ఇంకా వద్దు" అన్నాడు గోపాలం.

"ఏం? ఎందుకనీ" అనడిగింది వాళ్ళమ్మ-

"అమ్మాయి అందంగానే వుంది గానీ ఒకట్రెండు మార్లు కలిసి మాట్లాడితేనేగాని తత్వం బోధపడదు- అది బోధపడకపోతే తర్వాత తన్నుకు చావాలి. సంసారం నరకప్రాయమౌతుంది" అన్నాడు గోపాలం-

# ఇ'వేమన'పద్యాలు




ఇల్లు సుమీ సంసారము
ఇల్లు సుమీ యాయుధంబు నికవిను చాలా
తల్లి సుమీ పంచాక్షరి
కల్ల సుమీ సతులవలపు గదరా వేమా.

## ఎన్నిక

'రోజులు మారిపోయాయి. సరే కానీ' అన్నాడు గోపాలం నాన్న.

గోపాలం అమ్మానాన్న యీ విషయాన్ని రాధ అమ్మా నాన్నలతో చెప్పారు-

"మాట్లాడుకోమనండి. మాకేం అభ్యంతరం లేదు" అని గ్రీన్ సిగ్నల్ యిచ్చేరు వాళ్ళు- వాళ్ళకి వాళ్ళమ్మాయి మీద గొప్ప నమ్మకముంది- ఈ సంబంధం తప్పక కుదురుతుందన్న ఆశ కూడ వాళ్ళకి బాగానే కలిగింది.

అందుకే సరేనన్నారు-

అంతే!

ఆ శనివారమే రాధని వెంకటేశ్వరస్వామి కోవెలకి వెళ్దాం రమ్మని కబురు చేసేడు గోపాలం-

రాధకి కూడ అది పరీక్షా సమయమని తెల్సు- గోపాలం ఆమెకు నచ్చేడు- తను కూడ అతనికి నచ్చేలా ప్రవర్తించాలి. అనుకుంది-

శనివారం సాయంకాలం తనకు నచ్చిన ఆకాశ నీలం పాలిస్టర్ చీర కట్టుకుని, మేచింగ్ బ్లౌజు వేసుకుని జడలో ఫల సంపంగి పెట్టుకుని అందంగా తయారై గోపాలం చెప్పిన చోటుకి వచ్చింది.

రాధ అందానికి గోపాలం ఆశ్చర్యపోయినా ఆ రోజు ఆట్టే మాట్లాడలేదతను. రాధ కూడ నాలుగైదు మాటలు పొడి పొడిగానే మాట్లాడింది-

ఆ మరుచటి రోజు ఆదివారం బీచికి వెళ్దాం రమ్మన్నాడు గోపాలం- ఈ మారు రాధ అత్యంత ఆకర్షణీయంగా కళ్ళు చెదిరేలా వచ్చింది- లేటెస్ట్ డిజైన్‌గల కంచి పట్టు చీర కట్టుకుని తలలో మల్లె చెండు పెట్టుకుంది- కళ్ళకు కాటుక దిద్దింది.

ఆమె అందానికి అదిరి పడ్డాడు గోపాలం- అయినా ఆ రోజూ ఆమెతో ఆట్టే మాట్లాడలేకపోయాడు. పాపం సిగ్గేమోనని రాధే కాస్త చొరవ తీసుకుని ముందుకు వెళ్ళి అతనికేవేం స్వీట్స్ యిష్టమో కనుక్కుంది-

ఆ తర్వాత బుధవారమే ఏదో సెలవు కలిసొచ్చింది గోపాలానికి- ముచ్చటగా మూడో మారు రాధని ఎ.సి. హాల్లో ఆడుతున్న కొత్త సినిమాకు రమ్మన్నాడు-

'సరే- ఇంత వరకూ వచ్చేక తప్పుతుందా. చేసుకోక ఏం చేస్తాడు' అని రాధ తల్లి తండ్రులు ఆమెను పంపించేరు-

హాలు ముందు రిక్షా దిగుతున్న రాధను చూసి నీరుగారిపోయేడు గోపాలం- చిన్న పువ్వులున్న తెల్ల వాయిల్ చీర కట్టుకుంది రాధ- తెల్ల బ్లవుజు వేసుకుంది- తలలో సన్నజాజులు తురుముకుంది.

"టిక్కెట్లు తీసుకున్నారా" అనడిగింది రాధ దిగుతూనే-

జేబులో టిక్కెట్లున్నా "లేదు- దొరకలేదు- ఇంటికి పోవడమే" అన్నాడు గోపాలం.

"పోనీ బీచ్‌కి వెళ్దామా" అంది రాధ.

"ఒద్దు- తల నొప్పిగా వుంది" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు-

నిశ్చేష్టురాలై వుండిపోయింది రాధ.

*　　*　　*

"ఇంత అయ్యాక యిప్పుడొద్దంటే బావుంటుందట్రా? అసలేమైందీ... అందంగానే వుందన్నావుగా- మాట్లాడే నెపంతో పిల్చుకుని కూడ వెళ్లావుగా... ఏమైందసలూ" అడిగింది గోపాలం వాళ్ళమ్మ-

గోపాలం వెంటనే ఏం చెప్పలేదు- నాలుగైదు రోజులు వరసగా అడిగేక ఓరోజు సాయంకాలం నింపాదిగా చెప్పేడు-

"ఆ అమ్మాయికి చీర కట్టుకోడం కూడ తెలీదమ్మా. ఇంకెలా?"

కొడుకు మాటలకు విస్తుపోయిందావిడ-

"హవ్వ! అదట్రా... పోనీ నేర్చుకుంటుందిలే-పరికిణీ వోణీలె యిన్నాళ్ళూ వేసుకునుంటుంది-కుచ్చిళ్ళు సరిగా పెట్టుకోడం రాదో ఏమిటో? అంత మాత్రానికేనా?" అంది

"అది కాదమ్మా. నా ఆలోచనా పద్ధతికే ఆ పిల్ల తగదనిపించింది- నాకీ సంబంధం ఒద్దు" అన్నాడు గోపాలం.

"పోన్లే- ఇంతకీ జరిగిందేధో సరిగా చెప్పు" అడిగిందావిడ

"ఏముందీ- అందంగా వుంటే సరా! ఆ అమ్మాయికి ఏ పని ఎప్పుడు చెయ్యాలో తెలిసినట్టు లేదు- గుడికి రమ్మన్నప్పుడు పాలిస్టర్ చీర కట్టింది- బీచికేమో పట్టు చీరతో తయారైంది- శీతాకాలం.... అందులోనూ ఎ.సి. హాల్లో సినీమాకి రమ్మంటే వాయిల్ చీర కట్టుకొచ్చింది- ఇప్పుడు చెప్పు- ఏ చీర ఎప్పుడు కట్టుకోవాలో కూడ తెలియని దాన్ని నేనెలా కట్టుకునేదే" అంటూ మరో మాటకి ఆస్కారమివ్వకుండా బయటకెళ్ళిపోయాడు గోపాలం. □